ప్రమాదాలకు చెక్

- బోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షిత చర్యలు
- మర్ధగుడ చాపరాయిలో ప్రశాంతత
- ప్రమాద ఘటనలు లేకుండా అడ్డుకట్ట
- స్థానికులు, పర్యాటకుల ప్రశంసలు



మర్ధగుడ చాపరాయి వద్ద లోతుగా ఉన్న ప్రదేశంలోని బండరాళ్లతో నింపుతున్న ఎస్ఐ కరక రాము, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు (ఫైల్)

అనంతగిరి: ప్రకృతి అందాలకు నిలయం మన్యం... ఎటుచూసినా పచ్చని చెట్లు... మబ్బులను తాకుతున్న ఎత్తైన కొండలు.. కొండల చివరి నుంచి జాలువారు తున్న పాలనురుగు జలపాతాలు.. ఇటువంటి ఆహ్లాద కరమైన దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటాయి... కొండలపై వెళ్లి మేఘాల్లో తేలిపో యి..జలపాతాల్లో జలకాలాడాలని పర్యాటకులు ఉవి ళ్లూరుతుంటారు... ఈ మన్యంలోని అందాల జలపా తాల నడుమ పొంచి ఉన్న ప్రమాదం పొంచి ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఏ మాత్రం అజా గ్రత్తగా ఉన్నా..ఆదమరిచినా ప్రాణానికే ముప్పు అని హెచ్చరిస్తున్నారు.

నాడు ప్రమాదం.. నేడు సురక్షితం

మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్ధగుడ గ్రామం ప్రకృతి అందాలకు నిలయం..ఇక్కడ సమీ పంలో గల మర్ధగుడ చాపరాయి జలపాతం ప్రాంతం పిక్నిక్ స్పాట్‌గా పేరొందింది. ఈ ప్రాంతంలోని రెండు రాయిల మధ్యలో నుంచి గెడ్డ పారుతూ, చూపరులను ఆకట్టుకుంది. అవగాహన లేకుండా దిగితే ప్రాణాలకే ముప్పు. ఈ గెడ్డలో మునిగిన పర్యాటకులు మృత్యు వాతకు గురైన సంఘటనలు అనేకం... 2019లోని ఓ బాలిక ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందగా, 2020లోని ఓ యువకుడు ఈతకు దిగి మృత్యువా తపడ్డాడు. గత 2020లోని క్రితం ఓ బాలుడు ఈతకు దిగి మునిగి మృతిచెందాడు. తరచూ ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడుతుండడం పై మరలా ప్రమదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని, అనంతగిరి ఎస్ఐ కరక రాము ఆలో చించారు. 2022 జూలై నెలలోని పోలీస్‌శాఖ ఆధ్వ ర్యంలోని స్థానిక సర్పంచ్ సింహాద్రి సహకారంతో రక్షణ చర్యలకు చేపట్టారు. ప్రమాదాలు నివార ణకు చర్యలు చేపట్టడంపై పర్యాటకులు, స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బండరాళ్లతో ప్రమాదాలకు కట్టడి

మర్ధగుడ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి కూలీలు, పోలీస్ సిబ్బందితో కలిసి, ప్రమా దాలు జరుగుతున్న చాపరాయిగెడ్డ లోతుగా ఉన్న ప్రదేశాల్లో బండరాళ్లతో నింపారు. దీంతో గత రెం డేళ్లగా ప్రమాదాలు చోటుచేసుకోలేదు. అలాగే హెచ్చరికబోర్డులను సైతం ఏర్పాటుకు పోలీస్‌శాఖ చర్యలు చేపట్టడంపై పర్యాటకులు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల ప్రత్యేక చొరవ



పిక్నిక్‌స్పాట్ కావడంతో పలువురు వస్తుంటారు. ఈ నేపథ్యంలోని అవగా హన లేకపోవడం మృ త్యువాతపడ్డారు. దీనిపై స్థానిక ఎస్ఐ కరక రాము చొరవతో రక్షణ చర్యలు చేపట్టాం. గ్రామస్తులు సహకారం అందించారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, గత రెండేళ్లగా ఎటువం టి ప్రమాదాలు చోటుచేసుకోలేదు.

– కొర్రా సింహాద్రి.. ఎగువశోభ సర్పంచ్

ప్రమాదాలు జరగకుండా చర్యలు



అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై మరల ప్రమాదాలు జర గకూడదని, ఉద్దేశ్యంతో గత రెం డేళ్ల క్రితం లోతుగా ఉన్న ప్రదేశం లోని సుమారు నాలుగు రోజులు పాటుగా పోలీస్ సిబ్బంది, స్థానికులు సాయంతో బండ రాళ్లతో నింపడం జరిగింది. ప్రమాదాలు నివారించగలి గాం. సరియాతో పాటుగా చాపరాయి వద్ద చేపట్టిన చర్యలతో ఉద్యోగంలో సంతృప్తి నిచ్చింది.

–కరక రాము, ఎస్ఐ, అనంతగిరి

క్లుప్తంగా

చురుగ్గా డ్రైనేజీ పనులు



రామాలయం వీధిలో డ్రైనేజీ పనులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని రామా లయం వీధిలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభ మయ్యాయి. ఆయా పనుల్లో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడు సీసీ డ్రైనేజీలకు జిల్లా పరిషత్ జనరల్ నిధులు రూ.15లక్షలు నిధులు మంజూరయ్యాయి. డ్రైనేజీ పనులకు టెండర్ ఖరార్ కావటం కాం ట్రాక్టర్ పనులు చేపడుతున్నారు. మండలంలో జి.మాడుగుల రామాలయం వీధిలో రెండు డ్రైనేజీల నిర్మాణానికి ఒకొక్కటి రూ.6లక్షలు చొప్పున రూ.12లక్షలు నిధులు, జీ.ఎం కొత్తూరు గ్రామంలో రూ.3లక్షలు చొప్పున జెడ్పీ జనరల్ నిధులు మంజూరయ్యాయి. డ్రైనేజీ నిర్మాణ పనులు చకచకా జరుగు తున్నాయి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీ సమస్య తీరుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

నేడు వినియోగదారుల అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం నాయకులు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పం చాయతీ సూరిమెట్ట గ్రామంలో శుక్రవారం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు వినియోగదార్ల సంఘం నాయకులు కె.కేశవరావు, జల్లి శ్రీను తెలిపారు. వినియోగారుల సంఘం ఎన్నికై రెండు సం వత్సరాల కాలపరిమితి పూర్తయిందన్నారు. అవగాహన సదస్సు అనంతరం నూతనంగా మండల వినియోగదారుల సంఘం ఎన్నికలు జరుగుతాయన్నారు.నూతన కమిటీలో మం డల వినియోగదారుల సంఘంలో ఉత్సా హవంతులైన వారు ముందుకు రావాలని వారు కోరారు. వినియోదారుల హక్కులు ప్రతీ ఒక్క వినయోగదారుడు వినియోగించుకో వాలని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: మండలంలోని పురుషోత్తపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ బుద్దా ఆదినారాయణ తదితరులు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి, తల్లిదండ్రు లకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. విద్యా కమిటీ చైర్మన్ బుద్దా దేవి, సాగర్, ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకటర మణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ల ధరల పెంపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

అనకాపల్లి: భారీ బడ్జెట్ పేరిట సినిమా ధరల్ని విప రీతంగా పెం చడం సరి కాదని డీవై ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ ఆక్షేపించారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురు వారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సినిమా టికెట్ల ధరలు అడ్డగోలు పెంపు లేదని, ప్రస్తుత ప్రభుత్వం సామాన్యులు దోపిడీకి గురయ్యేలా ఇష్టారీతిన టికెట్ ధరల పెంపునకు అనుమతి వ్వడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా పెంచిన కల్కి సినిమా ధరల్ని తగ్గిం చాలని డిమాండ్ చేశారు. అల్లు రాజు, పి.చలపతి పాల్గొన్నారు.

గోడౌన్ నుంచి నిత్యావసరాలు తరలించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

మారేడుమిల్లి: జీసీసీ గొడౌన్ నుంచి ఈ నెల 30వ తేదీ లోగా నిత్యావసర సరకులు జీసీసీ డిపోలకు తరలించాలని తహసీల్దార్ రమణారావు తెలిపారు. మారేడుమిల్లిలో జీసీసీ సిబ్బంది, సెల్స్‌మెన్‌లు, రేషన్ డిపో డీలర్స్‌తో గురువారం సమావేశం నిర్వ హించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్‌లకు వెళ్లాల్సిన నిత్యావసర సరకులు త్వరితగతిన డిపోలకు తరలించాలని చెప్పారు. ప్రతీ నెల 1వ తేదీన ఖచ్చితంగా రేషన్ షాపు నుంచి ఎండీయూల ద్వారా నిత్యావసర సర కులు పంపిణీ చేయాలన్నారు. తూకంలో ఎక్కడ తేడా రాకూడదన్నారు. సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్, జీసీసీ డిపో మేనేజర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసీ ల్దార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే

- పరిమితికి మించిన ప్రయాణికులతో ఆటోల్లో ప్రయాణం
- పోలీసులు హెచ్చరించినా పట్టని వైనం



ఆటో వెనుక కూర్చుని సెల్‌ఫోన్ చూస్తున్న యువకులు



చింతూరు, కూనవరం రహదారిలో ఆటో వెనుక నిలబడి ప్రయాణిస్తున్న కూలీలు

చింతూరు: ప్రమాదమని తెలిసినా వారు పెడ చెవిన పెడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. ఆటోలపై పరిమితికి మించి ఎక్కుతూ, వెనుకవైపు నిలబడి మరీ ప్రయాణం చేస్తున్నారు. కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాల్లో పనుల నిమిత్తం చింతూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కూలీలు ఆటోలపై వెళ్తుం టారు. తెల్లవారుజామునే వెళ్లిన వారు పనులు ముగించుకుని మధ్యాహ్నం తిరిగివస్తారు. ఈ క్రమంలో ఆటోవాలాలు వారిని తమ ఆటోల్లో పరి మితికి మించి ఎక్కించడంతో పాటు యువతీ, యువకులను ఆటోకు వెనుకవైపు కూర్చోబెట్టడం లేదా నిలబెట్టడం చేస్తున్నారు. వెనుకవైపు కూర్చుంటున్న వారు సెల్‌ఫోన్లు చూస్తుండడం, నిర్లక్ష్యంగా ఉండడం వంటివి చేస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. వెనుకవైపు నిలబడిన, కూర్చున్న సమయంలో వారికి కునుకు వచ్చినా కిందపడే అవకాశాలున్నా ప్రమాదపు ప్రయాణాలు మానడంలేదు. దీనిపై పోలీసులు పలుమార్లు కేసులు నమోదు చేస్తున్నా ఆటో డ్రై వర్లు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తు న్నారు. ప్రమాదాలు జరిగాక విచారించడం కంటే ముందస్తుగానే ఇలాంటి ప్రయాణాలను అరికట్టా ల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు చెబు తున్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల పండగలు



మరిడిమాంబ ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు



చౌడువాడలో మల్లిలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: మండలంలోని నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. గుల్లేపల్లిలో మరిడిమాంబ, చౌడు వాడలో మల్లిలమ్మ, ఆర్.వై.అగ్రహారం, యద్లవాని పాలెం గ్రామాల్లో బంగారమ్మ అమ్మవార్ల పండ గలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సంప్రదాయబద్ధంగా ఈ పండగలను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. బంధువులు, స్నేహితుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. నాలుగు గ్రామాల్లో ఉదయం నుంచే అమ్మవార్లకు పూజలు చేసేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

గంగాలమ్మతల్లి గుడికి కేజీన్నర వెండి బహుకరణ



గంగాలమ్మతల్లి గుడికి కిలోన్నర వెండి బహుకరిస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి భక్తుల విరాళాలు అందజేస్తున్నారు. అవ కాశం ఉన్న ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అంద జేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్వర్గీయ కొయిలాడ అప్పారావు జ్ఞాపకార్థం భార్య సత్య వతి, కుటుంబ సభ్యులు అమ్మవారికి వడ్డాణం నిమిత్తం కేజీ న్నర వెండిని ఆలయ నిర్వాహకులకు అంద జేశారు. గంగప్పలనాయుడు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సరోజినీ

వీఆర్ పురం: రేఖపల్లి గ్రామం గొల్లగుడెంలో రూ.9 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని సర్పంచ్ పూనెం సరోజినీ గురు వారం పరిశీలించారు. రహదారి నిర్మాణాన్ని నాణ్య తగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచిం చారు. గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



లక్ష్మీపురంలో డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: గ్రామాలలో పారిశుద్యం మెరుగు కోసం అందరూ సహకరించాలని లక్ష్మీపురం సర్పం చ్ కె.త్రినాథ్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో గురువారం స్వచ్ఛ సంక ల్పన కార్యక్రమంలో భాగంగా ఇంటికీ రెండేసి చొప్పున డస్ట్ బిన్‌లను అందజేశారు.ఈ సందర్భం గా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్తను సేకరించి పంచాయతీకి అందిం చాలని, చెత్తను డ్రైనేజీ, బహిరంగ ప్రదేశాల్లో వేయ వద్దన్నారు. అపరిశుభ్రతతో దోమలు పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, రెండు డస్ట్ బిన్ లలో తడి, పొడి చెత్తను సేకరించాలని ఆయన ప్రజ లను కోరారు.ఉప సర్పంచ్ అర్లాబు సత్యం తదిత రులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ రేపు

నర్సీపట్నం: న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్ తగదాలు, క్రిమినల్, ట్రాఫిక్, పెట్టీ కేసులతో పాటు తదితర కేసులను పరిష్కరిస్తామన్నారు. కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

గొలుగొండ: జానకిరాం పురంలో సీతారాముల విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం గురు వారం ఘనంగా నిర్వ హించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పల్ల కిలో ఉత్సవమూర్తు లను ఊరేగించారు. శుక్రవారం సీతారాముల తృతీయ వార్షిక కల్యాణ వేడుకల్లో భాగంగా ఈ కార్య క్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకల సందర్భంగా అన్నసమారాధన నిర్వ హించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు అభయాంజనేయస్వామి వార్షికోత్సవాలు

మునగపాక : మునగపాక సంతబయిల అభ యాంజనేయ స్వామి 26వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం అలాగే ప్రత్యేక అభిషేకాలు ఉంటాయన్నారు. తమలపాకులతో సహస్రనామార్చన వంటి కార్య క్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దసం ఖ్యలో తరలివచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ కడబాల ఆనందరావు

వై.రామవరం: మండలప్ర జలకు అధికారులంతా సకాలంలో అన్ని రకాల సేవలు అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి అధికారు లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతు మండలంలోని ప్రజాప్రతినిధులను గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను తక్ష ణమే పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకోమని సూచించారు. జ్వరాలు, తదితర సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోమని అధికారులకు సూచించారు. ఎంపీడీ వో కె.బాపన్నదొర మాట్లాడుతూ ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలో యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగు వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. శానిటేషన్, ప్రజారోగ్యం, తాగు నీటి సమస్యలపై దృష్టి సారించమని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో బాపన్నదొర సూచిం చారు. వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగి రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు ముక్క రమణ, మండలంలోని సర్పంచ్‌లు, తహసీల్దార్ నాగరాజు, ఏపీవో సాయి బాబా, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పం చాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం జుత్తాడ ఎరకన్నదొర దంపతులను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి: మండలంలో భీంపోలు పంచాయతీ చిప్పపల్లి గ్రామంలో గల పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న జుత్తాడ ఎరక న్నదొరను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పలు పాఠశాలల ఉపాధ్యాయులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగుల నింపి 37 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుని వృత్తిలో సేవలు అందించడంఅభి నందనీయమన్నారు. ఎరకన్నదొరను మన మం దరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందుగా ఎస్.ఆర్.పంచాయతీలో ఎమ్మెల్యే మత్స్యలింగం పర్యటించారు. చీడివలస గ్రామంలో తాగునీటి, విద్యుత్ సమస్యలను ఎదుర్కొం టున్నామని పరిష్కరించాలని గిరిజన ప్రజల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ఆర్ పురంలో ప్రజా సమస్యలు ఆయన ఆరా తీసారు. ప్రజా సమ స్యలు పరిష్కరించటానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆర్.స్వామి, జెసీఎస్ మండల కో-ఆర్డినేటర్ నవీన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అప్పారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరలు పాల్గొన్నారు.

అంతర పంటల సాగు.. లాభాలు బాగు



వంగ తోటలో ఆనప పాదుల పెంపకం

రాజవొమ్మంగి: అంతర పంటలతో ఉపయోగాలు తెలిసిన ఏజెన్సీ రైతులు ఇప్పడిప్పుడే ఆ పద్ధతికి అలవాటు పడుతున్నారు. అర ఎకరం భూమిలో నాలుగు నుంచి ఐదు రకాల పంటలు పండిస్తు లాభం పొందుతున్నారు. రాజవొమ్మంగి పరిస రాల్లో అరటి తోటల్లో అపరాలు, కూరగాయ మొక్కలు, చెరకుతోటల్లో తీగజాతి కూరగాయ మొక్కలు సాగు చేస్తున్నారు. ప్రధాన పంటకు చెం దిన మొక్కల మధ్య ఖాళీగా ఉన్న భూమిని ఉప యోగించుకొని ఒకటి రెండు సంవత్సరాలు పాటు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ప్రధాన పంట ఏపుగా పెరిగి ఫలాసాయం ఇచ్చే వరకు అంతర్ పంటలుగా వేసిన కూరగాయలు, అపరాల వల్ల అదనపు లాభం పొందుతున్నామని స్థానిక రైతులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో ఓ వైపు వరిసాగు పనులతో పాటు మెట్ట వ్యవసాయ పనుల్లో రైతులు తలమున కలై ఉన్నారు.

విత్తనాల కొరత

అంతర పంటలకు అవసరమైన కూరగాయాలు, అపరా విత్తనాలు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.. నేల ఖాళీగా ఉన్నా నాణ్యమైన విత్త నాలు అందుబాటులో లేక పలు పంటలకు రైతులు దూరమవుతున్నారు. వ్యవసాయ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు రైతులకు అవసరమైన కూర గాయ విత్తనాలు సబ్సిడీ ధరకు విరివిగా సరఫరా చేయాలని కోరుతున్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



ఐ.పోలవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

రంపచోడవరం: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు లకు అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని రంపచోడవరం ఎంపీపీ బం దం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటల క్ష్మిలు అన్నారు. ఐ పోలవరం పంచాయతీలో ఆర్ బీకె కేంద్రంలో గురువారం విత్తనాలు పంపిణీ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ పండా సూరి బాబు, మాజీ సర్పంచ్ కంగల రామలత, ఏవో కిం టుకూరి లక్ష్మణరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహి నవరాత్రులు

అనకాపల్లి: మండలంలోని బట్లపూడి పంచాయతీ పరిధి నాయుడుపేట సోహం ఆశ్రమంలో జూలై 6 నుంచి 15 వరకు వారాహి అమ్మవారి నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకులు కాం డ్రేగుల రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6న ఆదివారాహి, 7న దండిని వారాహి, 8న బృ హద్ వారాహి, 9న ఉన్మత్త వారాహి, 10న స్వప్న వారాహి, 11న ధూమ్ర వారాహి, 12న వజ్ర వారాహి, 13న శ్వేత వారాహి, 14న కిరాత వారాహి, 15న మహా వారాహి అవతారాల్లో అమ్మ వారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఆల యానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల గకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులకు అన్నసమా రాధన ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు రానున్నట్టు తెలిపారు.

నది గట్టు పటిష్టం చేయాలని నిరసన

ఎస్.రాయవరం : వమ్మవరం శివారు విశ్వనాథ పురం గ్రామంలో కోతకు గురయిన వరాహానది గట్టు పటిష్టం చేయాలని కోరుతూ గురువారం గ్రామస్తులు నదిలో దిగి నిరసన తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనా రాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. నది గట్టు కోతకు గురికావడంతో వర్షాలు సమయంలో నది అధిక ప్రవాహంతో బిక్కు బిక్కుమని జీవించాల్సి వస్తుందన్నారు. అధికా రులు స్పందించి నది గట్టు పటిష్టం చేయాలని కోరారు. సోమిదేవపల్లి ల్లోనూ ఇదే సమస్య ఉం దని అధికారులు స్పందించాలని కోరారు.